

"విప్లవం కలహాలతో కలవలేదు. బాంబులు, తుపాకులు విప్లవం చేయలేవు. విప్లవం అనే కత్తికి మీ ఆలోచనలతో పదును పెట్టండి" - భగత్ సింగ్

Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 22 | సోమవారం 16 జూన్ 2025 | పేజీలు : 5 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## రేపు కెనడాలో
# జీ7 సదస్సు..

- సైప్రస్ చేరుకున్న ప్రధాని మోదీ
- ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ప్రారంభం
- అనంతరం కెనడాకు పయనం



2లో

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం
# 31 మంది మృతదేహాల గుర్తింపు పూర్తి

- 12 కుటుంబాలకు అప్పగింత
- డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతులను గుర్తించిన అధికారులు
- ఇప్పటివరకు 12 మృతదేహాలు వారి కుటుంబ సభ్యులకు అప్పగింత
- ప్రమాదంలో గాయపడిన 13 మందికి ఆసుపత్రిలో కొనసాగుతున్న చికిత్స
- మృతదేహాల గుర్తింపు ప్రక్రియలో ఫోరెన్సిక్ బృందాల నిరంతర కృషి





**అహ్మదాబాద్ - సూర్యవాస్తవం, జూన్ 15**

అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించిన వారిలో 31 మందిని డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించినట్లు సివిల్ ఆసుపత్రి అధికారులు వెల్లడించారు. వీరిలో 12 మంది మృతదేహాలను ఇప్పటికే వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మిగిలిన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని. వీరిలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి

- మిగతా 2లో..

## తల్లుల ఆనందం చూసి
# జగన్‌కు కడుపుమంట

- జగన్ గారూ కడుపు మంటగా ఉన్నట్టుంది.. రెండు ఈనో ప్యాకెట్లు పంపిస్తాను
- 'తల్లికి వందనం' సూపర్ సక్సెస్ అయిందని మంత్రి లోకేశ్ వ్యాఖ్య
- జగన్ తన పత్రికలో ఫేక్ ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- కొందరు లబ్ధిదారులకు క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే నిధుల విడుదలని స్పష్టం
- దొంగ లెక్కలు, అవినీతి జగన్ బ్రాండ్ అని, తమది కాదని విమర్శ
- జగన్‌కు రెండు ఈనో ప్యాకెట్లు పంపిస్తానంటూ లోకేశ్ వ్యంగ్యం

**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 15**



'తల్లికి వందనం' పథకం అద్భుత విజయం సాధించిందని, ఇది చూసి మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గారికి కడుపుమంట మూడు రెట్లు పెరిగిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వ్యంగ్యంగా వ్యాఖ్యా నించారు. అందుకే, ఈ పథకం అమలు తీరుపై జగన్ రెడ్డి తన పత్రిక ద్వారా మరోసారి అసత్య ప్రచారానికి తెరలేపారని ఆరోపించారు.

**"తల్లికి వందనం సూపర్ సక్సెస్! తల్లుల కళ్లలో ఆనందం చూసి**

జగన్ రెడ్డి గారి కడుపు మంట మూడింతలు పెరిగింది. మరోసారి తన విష పత్రికలో ఫేక్ ప్రచారానికి తెరలేపారు. ఆరుగురు కంటే ఎక్కువ పిల్లలు ఉన్న తల్లులు, లేదా అనాథ శరణాలయాల్లో ఉంటున్న పిల్లలకు ఇంకా డబ్బులు జమ చేయలేదు. గ్రామ సచివాలయం, లేదా వార్డు సచివాలయం సిబ్బంది ఫీల్డ్ వెరిఫికేషన్ చేసిన తరువాత మాత్రమే వారికి నిధులు విడుదల అవుతాయి. దొంగ లెక్కలు, డబ్బులు కొట్టేయడం మీ బ్రాండ్ జగన్ రెడ్డి గారు. మీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలే అందరూ చేస్తారు అనుకుంటే ఎలా? మాది ప్రజా ప్రభుత్వం తప్పు చెయ్యం... చెయ్యనివ్వం. జగన్ రెడ్డి గారూ కడుపు మంటగా ఉన్నట్టుంది... రెండు ఈనో ప్యాకెట్లు పంపిస్తాను వాడండి... కాస్త తగ్గుద్ది" అంటూ ఎద్దేవా చేశారు.

## పొగాకు కొనుగోళ్లకు
# రూ.150 కోట్లు కేటాయించండి

- కేంద్రమంత్రి పియూష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు భేటీ...
- హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోళ్లపై కేంద్రమంత్రికి చంద్రబాబు వినతి
- పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గించాలని కోరిక
- ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్ జీఎస్టీపైనా చర్చ
- రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వినతి పత్రం



**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 15**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖామంత్రి పియూష్ గోయల్‌తో సమావేశమయ్యారు. ఏపీ రాజధాని అమరావతిలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలు కీలకమైన అంశాలపై ఇరువురు నేతలు కూలంకషంగా చర్చించారు. రాష్ట్ర రైతులు, పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ముఖ్యంగా, హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోళ్ల అంశంపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. పొగాకు ధరలు గణనీయంగా పడిపోయిన నేపథ్యంలో, రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వమే సుమారు రూ.300 కోట్ల వ్యయంతో 20 మిలియన్ కిలోల పొగాకును

- మిగతా 2లో..



# విదేశాంగ విధానం గందరగోళం

## - ఐరాస తీర్మానంపై ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టిన కాంగ్రెస్

2లో

## ప్రభుత్వ శాఖల్లో
# అవినీతి సహించేది లేదు

- అవినీతి రుజువైతే చర్యలు తప్పవన్న సీఎం చంద్రబాబు
- ఆరోపణలు వస్తే తక్షణ విచారణ
- 10 ముఖ్యమైన ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించాలని ఆదేశం
- ఐవీఆర్ఎస్ ప్రజాభిప్రాయ సేకరణపై సీఎం సమీక్ష



**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 15**

ఏ శాఖలో, ఎక్కడ, ఎవరు అవినీతికి పాల్పడినా సహించేది లేదని, జీరో కరెప్షన్ దిశగా రాష్ట్రంలో పాలనా వ్యవస్థను నిర్మించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎక్కడ అవినీతి జరుగుతుందో అక్కడ ప్రధానంగా దృష్టి పెట్టి విచారణ జరపాలని, అవినీతి రుజువైతే తక్షణం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏడాది పాలనపై ప్రజల నుంచి, వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై వ్యక్తమైన అభిప్రాయాలపై నిన్న ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంపై అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైనట్లు ఐవీఆర్ఎస్, సీఎస్‌డీఎస్ ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజాభిప్రాయ

- మిగతా 2లో..



# కేదార్‌నాథ్‌లో కూలిన హెలికాప్టర్
## - ఏడుగురు మృతి

**కేదార్‌నాథ్ - సూర్య వాస్తవం, జూన్ 15:**

ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే హెలికాప్టర్ కూలిపోయింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో ఏడుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరాఖండ్‌లో దాదాపు 40 రోజుల్లో ఇది ఐదవ హెలికాప్టర్ ప్రమాదం. హెలికాప్టర్ కేదార్‌నాథ్ నుండి గుప్త్ కాశికి వెళ్తుంది. ప్రమాద సమయంలో హెలికాప్టర్ లో ఐదుగురు పెద్దలు, ఒక పిల్లవాడు, ఒక పైలట్ ఉన్నారు. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈ ఘటనపై ఎక్స్ లో స్పందించారు. "రుద్రప్రయాగ్ జిల్లాలో హెలికాప్టర్ ప్రమాదం విచారకరమైనది. ఎస్.డి.ఆర్.ఎఫ్, స్థానిక పరిపాలన మరియు ఇతర రెస్క్యూ బృందాలు సహాయ, రెస్క్యూ ఆపరేషన్లలో నిమగ్నమై ఉన్నాయి." అని పేర్కొన్నారు.


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం

# 31 మంది మృతదేహాల గుర్తింపు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

విజయ్ రూపానీ మృతదేహం కూడా ఉందని, ఆయన డీఎన్ఏ పరీక్ష ఫలితాలు ఇంకా రావాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు.

సివిల్ ఆసుపత్రి ఏడీఎంఎస్ డాక్టర్ రజనీష్ పటేల్ మీడియాతో మాట్లాడుతూ "ఇప్పటివరకు 31 మంది వ్యక్తుల డీఎన్ఏ సరిపోలింది, వారిని గుర్తించాం. వీరిలో 12 మృతదేహాలను ఉదయ్‌పూర్, వడోదర, ఖేడా, కుషీనగర్, అహ్మదాబాద్‌లోని వారి స్వస్థలాలకు పంపించాం" అని తెలిపారు. "మిగిలిన వారి ఆప్తుల మృతదేహాలను తీసుకెళ్లేందుకు మరికొన్ని కుటుంబాలు ముందుకు రావాల్సి ఉంది. ఇతరుల డీఎన్ఏ ఫలితాలు ఇంకా రావాల్సి ఉంది" అని ఆయన వివరించారు.

మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ డీఎన్ఏ పరీక్ష ఇంకా కొనసాగు తోందని డాక్టర్ పటేల్ ధ్రువీకరించారు. "ఇప్పటివరకు ఆయన డీఎన్ఏ సరిపోలలేదు. ఫలితం రాగానే సంబంధిత అధికారులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 13 మంది ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని కూడా ఆయన వెల్లడించారు.

మృతదేహాలు తీవ్రంగా కాలిపోయి, గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో, వాటిని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు తప్పనిసరి అయ్యాయి. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) కు చెందిన ఫోరెన్సిక్ బృందాలు ఈ బృహత్తర గుర్తింపు ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. బాధిత కుటుంబాలకు త్వరితగతిన ఊరట కలిగించేందుకు ఈ బృందాలు అహోరాత్రులు శ్రమిస్తున్నాయి.

ఈ నెల 12న అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అదుపుతప్పి సివిల్ ఆసుపత్రి బి.జె. మెడికల్ కళాశాల సమీపంలోని జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమాన ప్రయాణికులు, నేలపై ఉన్న నివాసితులు సహా 260 మందికి పైగా మరణించారు. ఒక ప్రయాణికుడు మాత్రం గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదం వల్ల సమీప ప్రాంతాల్లో, ముఖ్యంగా అక్కడి వైద్య విద్యార్థుల వసతి గృహాలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

## రేపు కెనడాలో

# జీ7 సదస్సు..

- సైప్రస్ చేరుకున్న ప్రధాని మోడీ
- ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ పర్యటన ప్రారంభం
- అనంతరం కెనడాకు పయనం

**నికోసియా- సూర్యవాస్తవం, జూన్ 15**

మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ ద్వీప దేశమైన సైప్రస్‌కు ఆదివారం చేరుకున్నారు. దేశాధ్యక్షులు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ఆయనకు స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు ప్రధాని మోడీ పర్యటన కొనసాగనుంది. 23 ఏళ్ల తర్వాత ఓ భారత ప్రధాని సైప్రస్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇందులో భాగంగా క్రిస్టోడౌలైడ్స్‌తో మోడీ సమావేశం కానున్నారు. వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పునరుత్పాదక ఇంధనం, కౌంటర్ టెర్రరిజం తదితర రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకునే దిశగా చర్చలు జరపనున్నారు. మూడు దేశాల పర్యటనకు బయల్దేరే ముందు ప్రధాని మోడీ ఓ ట్వీట్ చేస్తూ.. మధ్యధరా, ఇయు ప్రాంతంలో సైప్రస్‌ను విలువైన భాగస్వామిగా పేర్కొన్నారు. ఈ పర్యటన ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సాంస్కృతికం వంటి కీలక రంగాల్లో సంబంధాలను మరింత పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే.. ఇజ్రాయిల్-ఇరాన్ పరస్పర దాడుల కారణంగా పశ్చిమాసియాలో గగనతల ఆంక్షల నేపథ్యంలో ప్రధాని మోడీ విమానం అరేబియా సముద్రం, ఆఫ్రికా గగనతలం మీదుగా సైప్రస్‌కు చేరుకున్నట్లు సమాచారం. సైప్రస్ నుంచి ప్రధాని మోడీ నేరుగా కెనడాకు వెళ్తారు. ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు జూన్ 16-17న కననాస్కిస్‌లో జరగనున్న జి-7 సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో ప్రధాని మోడీ పాల్గొనడం వరుసగా ఆరోసారి. ఇందులో భాగంగా జి-7 దేశాధినేతలతో సమావేశం కానున్నారు.

# నీట్ ర్యాంకర్లకు అభినందనలు తెలిపిన నారా లోకేశ్

- నీట్ యూజీ 2025 ఫలితాల్లో సత్తా చాటిన ఏపీ విద్యార్థులు
- టాప్ 100 ర్యాంకుల్లో రాష్ట్రానికి చెందిన ఆరుగురికి చోటు
- విద్యార్థులను అభినందిస్తూ మంత్రి నారా లోకేశ్ ట్వీట్
- 19వ ర్యాంకుతో డి.కార్తీక్ రామ్ కిరీటి అగ్రస్థానంలో
- రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు రాణించడంపై మంత్రి సంతోషం
- వైద్య వృత్తి ద్వారా ప్రజలకు సేవ చేయాలని విద్యార్థులకు పిలుపు

**అమరావతి - సూర్యవాస్తవం, జూన్ 15**



నీట్ యూజీ 2025 ఫలితాలు శనివారం విడుదల కాగా, ఏపీకి చెందిన విద్యార్థులు సత్తా చాటడంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందిస్తూ ట్వీట్ చేశారు. "వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ యూజీ పరీక్షా ఫలితాల్లో టాప్-100లో రాష్ట్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించడం పట్ల వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. 19వ ర్యాంకు సాధించిన డి.కార్తీక్ రామ్ కిరీటి, 56వ ర్యాంకు సాధించిన కె.మోహిత శ్రీరామ్, 59వ ర్యాంకు సాధించిన డి.సూర్యచరణ్, 64వ ర్యాంకు సాధించిన పి.అవినాశ్, 70వ ర్యాంకు సాధించిన వై.సమీర్ కుమార్, 92వ ర్యాంకు సాధించిన టి.శివమణిదీప్ లకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీపరీక్షలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉంది. విద్యార్థులు తమ ప్రతిభతో జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి గర్వకారణంగా నిలిచారు. వైద్య వృత్తి ద్వారా భవిష్యత్ లో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షిస్తున్నాను" అని వివరించారు.

# ఏపీలో డీఎస్సీ పరీక్షల వాయిదా

- అంతర్జాతీయ యోగా దినోత్సవం కారణంగా పరీక్షల తేదీలను మార్చిన ప్రభుత్వం...
- జూన్ 20, 21 తేదీల్లో జరగాల్సిన పరీక్షలు జూలై 1, 2 తేదీలకు మార్పు
- విశాఖలో ప్రధాని మోదీ పాల్గొననున్న భారీ యోగా కార్యక్రమం
- అభ్యర్థుల సౌకర్యార్థమే ఈ నిర్ణయమని ప్రభుత్వ ప్రకటన




**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 15**

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) తేదీల్లో మార్పులు చోటు చేసు కున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 20, 21 తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ పరీక్షలను వాయిదా వేసి, వాటిని జూలై 1, 2 తేదీల్లో నిర్వహించనున్నట్లు డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి శనివారం ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించారు. విశాఖపట్నం సాగర తీరంలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరుకానున్నారు. సుమారు ఐదు లక్షల మందితో యోగాసనాలు వేయించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఈ కార్యక్రమం దృష్ట్యా, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఆ పనుల్లో నిమగ్నమై ఉంటుందని, అదే సమయంలో రవాణా సౌకర్యాలు కూడా పరిమితంగా అందుబాటులో ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షలు నిర్వహిస్తే అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ వాయిదా నిర్ణయం తీసుకుంది.

డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి విడుదల చేసిన ప్రకటన ప్రకారం, వాయిదా పడిన పరీక్షలకు సంబంధించిన అభ్యర్థులు తమ సవరించిన హాల్‌టికెట్లను జూన్ 25వ తేదీ నుంచి అధికారిక వెబ్‌సైట్ https://apdsc.apcfss.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ హాల్‌టికెట్లలో కొత్త పరీక్షా కేంద్రాలు, మార్చిన తేదీల వివరాలు స్పష్టంగా పొందుపరచబడతాయని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఈ మార్పులను గమనించి, కొత్త హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, దాని ప్రకారమే పరీక్షలకు హాజరు కావాలని కృష్ణారెడ్డి సూచించారు. అభ్యర్థుల సౌకర్యాన్ని, రాకపోకలకు ఎలాంటి అంతరా యం కలగకూడదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

## ప్రభుత్వ శాఖల్లో

# అవినీతి సహించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

సేకరణపై టెక్నికల్ ఆడిటింగ్ జరపాలని, సమస్యలు ఉన్న చోట సంతృప్తి పెంచేలా చూడాలని సీఎం అన్నారు. సంక్షేమం, ఉద్యోగాల కల్పన, రహదారులు వంటి 10 ముఖ్యమైన ప్రజా సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. వర్క్ ఫ్రమ్ హోమ్, పెట్టుబడుల రాక, నైపుణ్య శిక్షణతో ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయో తెలియజేయాలన్నారు.

175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు, ఆగస్ట్ 15 కల్లా అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర కింద అందించాలని స్పష్టం చేశారు. మరోవైపు వికలాంగులు, వృద్ధులకు రేషన్ సరుకులు ఇంటికి తీసుకువెళ్లి అందించడం మరింత మెరుగ్గా జరిగేలా ఆలోచన చేయాలన్నారు. చౌక ధరల దుకాణాలను పెంచడం, నగదు లేదా కూపన్లు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలపై లబ్ధిదారుల అభిప్రాయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. అలాగే ఉచిత ఇసుక విధానం అమలులో ఇసుక లేని చోట్ల సంతృప్తి, ఇసుక ఉన్న చోట అసంతృప్తి ఉండటంపై ప్రాంతాల వారీగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

### ప్రజాభిప్రాయం ఇలా

పింఛన్ల పంపిణీలో అవినీతి లేదని 85 శాతం మంది, ఇంటి దగ్గరే ఇస్తున్నారని 87.8 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బావుందని 83.9 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎస్‌డీఎస్ ఫీల్డ్ సర్వేలో లబ్ధిదారులను నేరుగా కలిసి ప్రశ్నించగా పింఛన్ల పంపిణీలో అవినీతి లేదని 93.9 శాతం మంది, ఇంటి దగ్గరే ఇస్తున్నారని 93.3 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బావుందని 73.3 శాతం మంది, పర్వాలేదని 23.1 శాతం మంది చెప్పారన్నారు.

అన్న క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉన్నాయని 80.5 శాతం, ఆహారం నాణ్యత బావుందని 79.3 శాతం, సమయపాలన పాటిస్తున్నారని 80.8 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా చెప్పారన్నారు. ఆస్పత్రి సేవలు క్వాలిటీ చెకప్‌పై 68.4 శాతం, రక్త పరీక్షలపై 55 శాతం, ఉచిత మందుల పంపిణీపై 65.5 శాతం, సిబ్బంది ప్రవర్తనపై 71.3 శాతం సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో రోజూ చెత్త సేకరణపై 68.1 శాతం, 24 గంటల్లో చెత్త డంప్ తరలింపుపై 57 శాతం సంతృప్తి చెందారని చెప్పారు.

ఆలయాలలో సౌకర్యాలకు సంబంధించి 68 శాతం దర్శనం బాగుందని, 63.6 శాతం సౌకర్యాలు బావున్నాయని, 77.7 శాతం ప్రసాదం నాణ్యత బావుందని భక్తులు చెప్పారన్నారు. ఏపీఎస్ఆర్టీసీలో శుభ్రత, సీటింగ్ విషయంలో 53.4 శాతం, నీటి సౌకర్యం 45.2 శాతం, టాయిలెట్స్‌పై 56 శాతం, బస్సు సమయం-రూట్ వివరాలపై 61.5 శాతం, 69 శాతం మంది బస్సులు సమయానికి బయల్దేరుతున్నాయని, 69.7 శాతం సమయానికి చేరుకుంటున్నామని, 72.4 శాతం సిబ్బంది ప్రవర్తన బాగుందని, 69.7 శాతం రక్షణ కలిగి ఉన్నాయని చెప్పారన్నారు.

దీపం-2లో ఎక్కువ డబ్బు వసూళ్లు చేయడం లేదని 62.8 శాతం చెప్పారని అధికారులు వివరించారు. నెలనెలా రేషన్ సరుకులు తీసుకుంటున్నామని 75.1 శాతం, నాణ్యత బాగుందని 73.8 శాతం చెప్పారన్నారు. ఎరువుల లభ్యత ఉందని 60.9 శాతం మంది రైతులు చెప్పారన్నారు. సమయానికి విత్తనాల సరఫరా జరిగిందని 63 శాతం, తమ ప్రాంతంలో డ్రగ్స్ సంబంధిత సమస్య ఉందని 27.4 శాతం, పోలీసులు స్పందిస్తున్నారని 54.5 శాతం, పబ్లిక్ ప్రాంతాల్లో వేధింపులు ఉన్నాయని 27.8 శాతం, పోలీసుల స్పందన బావుందని 59.5 శాతం, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని 56.3 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు.

రిజిస్ట్రేషన్‌లో స్లాట్ బుకింగ్ ప్రాసెస్‌పై 63.4 శాతం సంతృప్తి వ్యక్తం చేయగా, అవినీతి లేదని 62.3 శాతం మంది చెప్పారన్నారు. ఇసుక రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌పై 70.6 శాతం, లభ్యతపై 67.5 శాతం, ధర పైన 61.1 శాతం సంతృప్తి వ్యక్తం చేయగా, రెవెన్యూ ఎఫ్ లైన్‌పై ఎక్కువ డబ్బులు వసూళ్లు చేయడం లేదని 77.4 శాతం, పాస్‌బుక్ సర్వేలో ఎక్కువ మొత్తం తీసుకోలేదని 75.1 శాతం చెప్పారన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతోందని 61.6 శాతం, పంచాయతీ చెత్త సేకరణ జరుగుతోందని 56.7 శాతం, ఎన్టీఆర్ వైద్య సేవ అడ్మిషన్లపై 86.2 శాతం, సేవలపై 81.3 శాతం, ఆరోగ్య మిత్ర సాయంపై 82.4 శాతం మంది సంతృప్తి వ్యక్త చేయగా అవినీతి లేదని 78.5 శాతం తెలిపారన్నారు.

# విదేశాంగ విధానం గందరగోళం

## - ఐరాస తీర్మానంపై ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ - సూర్యవాస్తవం, జూన్ 15**

గాజాలో కాల్పుల విరమణ కోరుతూ ఐక్యరాజ్యసమితి ఆమోదించిన తీర్మానంపై ఓటింగ్ జరిగినప్పుడు భారత్ గైర్హాజరు కావడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. భారత విదేశాంగ విధానం అస్తవ్యస్థంగా, గందరగోళంగా ఉన్నదని విమర్శించింది. పశ్చిమాసియాలో శాంతి స్థాపన కోసం కాల్పుల విరమణ పాటించి చర్చలు జరపాలంటూ ఇప్పటి వరకూ ప్రవచనాలు పలికిన కేంద్రం ఆ వైఖరిని విడనాడిందా అని ప్రశ్నించింది. ఓటింగ్‌కు గైర్హాజరు కావాలన్న నిర్ణయంతో భారత్ ఒంటరి అయిందని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శించారు. విదేశాంగ మంత్రి జయశంకర్ పదే పదే చేస్తున్న తప్పులను ప్రధాని నరేంద్ర మోడీ సరిదిద్దాలని, జవాబుదారీతనంతో వ్యవహరించేలా చూడాలని ఖర్గే సూచించారు.

'గాజాలో కాల్పుల విరమణ పాటించాలంటూ ఐరాస ఆమోదించిన తీర్మానానికి 149 దేశాలు మద్దతు తెలిపాయి. 19 దేశాలు మాత్రమే ఓటింగుకు గైర్హాజరు కాగా వాటిలో భారత్ కూడా ఉంది. ఈ చర్యతో మనం ఒంటరిగా మిగిలిపోయాం' అని ఖర్గే చెప్పారు. ఇజ్రాయిల్ ప్రజలపై హమాస్ జరుపుతున్న దాడులను కూడా కాంగ్రెస్ ఖండిస్తోందని ఆయన గుర్తు చేశారు. అలీన సిద్ధాంతానికి, నైతిక దౌత్యానికి కట్టుబడి ఉండడం భారత్ దీర్ఘకాలిక వైఖరి అని తెలిపారు. కాగా దక్షిణాసియా, బ్రిక్స్, ఎస్‌సీఓలో ఐరాస తీర్మానంపై ఓటింగ్‌కు దూరంగా ఉన్న ఏకైక దేశం మనదేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. 'నెహ్రూ వారసత్వంపై వారికి గౌరవం ఎలాగూ లేదు. కానీ పాలస్తీనాపై వాజ్‌పేయి అవలంబించిన వైఖరికి ఎందుకు దూరంగా ఉన్నారు?' అని ప్రశ్నించారు. ఐరాస తీర్మానంపై ఓటింగుకు భారత్ గైర్హాజరు కావడం సిగ్గుచేటు, విచారకరమని ప్రియాంక గాంధీ అన్నారు.

## పొగాకు కొనుగోళ్లకు

# రూ.150 కోట్లు కేటాయించండి

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు చేస్తున్నట్లు ఆయన కేంద్రమంత్రికి వివరించారు. ఈ ప్రక్రియ కోసం బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఏడు పొగాకు కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న ఈ రూ.300 కోట్లలో, టొబాకో బోర్డు ద్వారా రూ.150 కోట్లను భరించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. అంతేకాకుండా, పొగాకు ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి కీలక ప్రక్రియలను టొబాకో బోర్డు ద్వారా సమర్థవంతంగా నియంత్రించేందుకు వీలుగా ప్రస్తుత చట్టాలకు అవసరమైన సవరణలు చేయాలని కూడా ఆయన పీయూష్ గోయల్‌ను అభ్యర్థించారు.

పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 10 శాతానికి తగ్గించే ప్రతిపాదనను పునఃపరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రమంత్రిని కోరారు. ఈ సుంకం తగ్గింపు నిర్ణయం వల్ల రాష్ట్రంలోని పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర లభించక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్' లక్ష్యాల సాధనకు కూడా ఈ నిర్ణయం ప్రతికూలంగా పరిణమిస్తుందని సీఎం గుర్తుచేశారు.

ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం విధించిన అధిక సుంకాల సమస్యను కూడా చంద్రబాబు ప్రస్తావించారు. ఈ విషయంలో అమెరికాతో చర్చలు జరిపి, సుంకాల భారాన్ని తగ్గించేలా చూడాలని ఆయన సూచించారు. ముఖ్యంగా సీఫుడ్‌పై అమెరికా విధించిన 27 శాతం సుంకాల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 8 లక్షల మంది ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ఆక్వా రైతులపై పడుతున్న ఈ అదనపు భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే, మామిడి గుజ్జు (మ్యాంగో పల్ప్) పై ప్రస్తుతం ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి పియూష్ గోయల్‌ను కోరారు. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఆయన ఈ సందర్భంగా గోయల్‌కు తెలియజేశారు. రాష్ట్ర రైతాంగం, పారిశ్రామిక వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం..

### - మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్



**హిందూపురం టౌన్ -సూర్య వాస్తవం, జూన్ 15 :** శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాలు మేరకు యోగ మాసోత్సవాలు జరుగుతున్న సందర్భంగా శ్రీ గుడ్డం రంగనాథ స్వామి ఆలయంలో యోగాంధ్రలో భాగంగా హిందూ పురంలోని యోగ సాధకులు పెద్ద ఎత్తున వచ్చి యోగ విన్యాసాలు చేశారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ డి ఈ రమేష్ కుమార్ మాట్లాడుతూ భారతీయ ప్రాచీన ఆరోగ్య విధానంగా వ్యక్తిత్వ విద్యగా ఉన్నటు వంటి యోగా ఆరోగ్యకరమైన జీవన విధానానికి అత్యద్భుతమైన సాధనమని అన్నారు ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్యం మానసిక ప్రశాంతతకు యోగా ప్రాణయామ ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం యోగా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ చైతన్యం కలిగించేందుకు కోసం యోగాంధ్రా మాసోత్సవాలు జరుగుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యోగా తెరఫీ సభ్యులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## హోటల్ నిర్వాహకుడి పై దాడి



**మదనపల్లె - సూర్య వాస్తవం, జూన్ 15 :** మదనపల్లె టమోటా మార్కెట్ యార్డులో హోటల్ నిర్వహిస్తున్న వ్యక్తిపై శనివారం రాత్రి ఓ స్కూటరిస్టు దాడి చేశాడు. ఘటనపై ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసుల కథనం మేరకు .. టమోటా మార్కెట్ యార్డులో సయ్యద్ ఖాన్ (60) హెూటల్ నిర్వహిస్తున్నాడు. రాత్రి ఓ వ్యక్తి బైక్‌లో వచ్చి తన హెూటల్ ముందు బైక్ ను నిలబెట్టాడు. హోటల్ ముందు బైకు అడ్డం పెట్టద్దనడంతో ఆగ్రహించిన ఆ వ్యక్తి సయ్యద్ ఖాన్ పై కొబ్బరి కాయతో దాడి చేశాడు. గాయపడ్డ బాదితున్ని ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్ట్‌కు తీవ్ర గాయాలు



**మదనపల్లె - సూర్య వాస్తవం, జూన్ 15 :** ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు కు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో వెలుగు చూసింది. ఘటనపై మదనపల్లి ఆసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం, కొండామారిపల్లి బైపాస్ రోడ్డులో కాపురం ఉంటున్న జగదీష్(35) సొంతపనిపై బైకులో కర్ణాటకలోని రాయల్పాడుకు వెళ్ళాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బైక్ లో వస్తుండగా, మార్గమధ్యంలోని చీకిలబైలు- కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్ పోస్టు వద్ద కట్టెల లోడుతో వస్తున్న ట్రాక్టర్ బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ జగదీష్ ను కర్ణాటక 108 సిబ్బంది, మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉందని రాయల్పాడు పోలీసులు తెలిపారు.

## భార్యపై కోపంతో భర్త ఆత్మహత్యాయత్నం



**మదనపల్లె - సూర్య వాస్తవం, జూన్ 15 :** భార్యతో గొడవపడి భర్త విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని శేష మహల్ దగ్గర కాపురం ఉంటున్న నరసింహనాయుడి కొడుకు ఈ సురేష్ (39) భార్య అమరావతి తో ఆదివారం గొడవపడి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబీ కులు గమనించి బాధితున్ని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు వైద్యం అందించడంతో ప్రణాపాయం తప్పి కోలుకుంటున్నాడు. వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


## కొడూరు విద్యార్థిని అఫ్రిన్‌ను అభినందించిన మంత్రి



**రాయచోటి-సూర్య వాస్తవం, జూన్15:** అన్నమయ్య జిల్లా పరిధిలోని నియోజవర్గ కేంద్రం రైల్వే కొడూరు పట్టణానికి చెందిన ఎస్.అఫ్రిన్ రాయచోటి పట్టణంలోని సాయి డిగ్రీ కాలేజ్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని స్కేటింగ్‌లో ప్రతిభ చూపి విశ్వవిద్యాలయ స్థాయిలో మూడో స్థానం (3వ ర్యాంక్) సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. యువతలో క్రీడా ప్రోత్సాహాన్ని పెంపొందించేందుకు స్ఫూర్తిదాయకమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు.

# పేదల నాయకుడు చంద్రబాబుకు కృతజ్ఞతలు

### - సీ.ఏం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



**రాయదుర్గం -సూర్య వాస్తవం, జూన్ 15 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాయదుర్గం నియోజకవర్గం ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. నియోజ కవర్గంలోని కొంతమంది వ్యక్తులకు ఆరోగ్య సమస్యలపై రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు దృష్టికి తీసుకురాగా, వెంటనే ఎమ్మెల్యే స్పందించి నియోజకవర్గంలోని ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కాల్వ శ్రీనివాసులు చెక్కులను పంపిణీ చేశారు. పేదలు, దిగువ మధ్య తరగతి వర్గాల వైద్య సేవలకు ఆర్థిక చేయూతనిస్తూ ఆదుకొంటున్న మనసున్న వ్యక్తి చంద్రబాబని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కొనియాడారు.

రాయదుర్గం పట్టణంలోని ఎమ్మెల్యే ఇంట్లో 46మందికి సీ.ఏం.ఆర్.ఎఫ్ కింద మంజూరైన రు.24లక్షల చెక్కులు ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలువ శ్రీనివాసులు మాట్లా డుతూ... పేదలకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవటానికి తానున్నా న్నంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందిస్తారన్నారు. అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండటం మన రాష్ట్ర ప్రజానీకం చేసుకొన్న గొప్ప అదృష్టమని వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో అనేకమంది అప్పులు చేసుకుని మరీ వైద్యం చేసుకొంటునారన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్న అలాంటి వారికి ప్రభుత్వం తరపున ఉదతాభక్తిగా ఆర్థిక చేయుతనందించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 2014-19మధ్యన వందలాది మందికి సీ.ఏం.ఆర్.ఎఫ్ కింద దాదాపు రూ.కోటి పంపిణీ చేశామన్నారు. తిరిగి ఈ ఏడాది కూడా అదే విధంగా వైద్య సేవల నిమిత్తం ఆర్థిక సాయం తమ చేతుల మీదుగా అందిస్తుండటం ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకొన్నప్పుడు జీవిత కాలం వారంతా గుర్తు పెట్టుకొం టారన్నారు. పేదల కోసం మానవతా దృక్పథంతో ఈ పథకాన్ని కొనసాగిస్తున్న చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్లు బలరామి రెడ్డి, లాలేప్ప, కురుబ హనుమంతు, రాష్ట్ర ఆర్యవైశ్య, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్లు నాగల్లీ రాజు, పురుషోత్తం, మాజీ చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ టి. హనుమంతు, క్లస్టర్ ఇంచార్జి మోహన్ రెడ్డి, కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్టాప్ డయేరియా కాంపెయిన్‌ను విజయవంతం చేద్దాం

### - డీఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉషశ్రీ




**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, జూన్ 15 :** స్టాప్ డైయేరియా (అతిసారాను నిలిపేద్దాం)స్పెషల్ కాంపెయిన్ ను విజయవంతం చేద్దామని అన్నమయ్య జిల్లా డి. ఎమ్. హెచ్. ఓ. డాక్టర్ ఉషశ్రీ అన్నారు. డి. ఎమ్. హెచ్. ఓ. డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుచు ఈనెల 16 వ తేదీ నుండి జులై 31వ తేదీ వరకు స్టాప్ డైయేరియా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అన్నారు. 2025సంవత్సరమునకు 5సంవత్సరాల లోపు పిల్లల మరణాలు 1000సజీవ జననాలకు 23 కు తగ్గించడమే జాతీయ ఆరోగ్య పాలసీ ప్రధాన లక్ష్యం అన్నారు."రోజుకు మూడు లేదా నాలుగు సార్లు పలుచగా నీళ్ల మాదిరిగా విరోచనాలు అయితే దానిని అతిసారా వ్యాధి "అంటారు. వీలైనంత వరకు అతిసారా వల్ల సంభవించే మరణాలను ఓ. ఆర్. ఎస్ , జింక్ చికిత్స తో పాటుగా సరిపడా పౌష్టికాహారం తీసుకోవడంతో నివారించవచ్చు. స్టాప్ డైయరియా ప్రోగ్రామ్ ముఖ్య లక్ష్యం అతిసారా తో ఏ ఒక్క మరణం జరగకుండా చేయడం. అందుకోసం ఓ. ఆర్. ఎస్ , జింక్ కవరేజ్ ను పెంచడం, పట్టణ మురికి వాడలు, కరువు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలు, తొందరగా వ్యాధులకు గురి అయ్యే వర్గాల పై ప్రత్యేక నిఘా ఉంచడం. ఓ. ఆర్. ఎస్, జింక్ అందుబాటులో ఉంచుకోవడం, నిర్జలీకరనను ప్రమాధాకరంగా మారకుండా చూడటం, ఐ.ఈ. సి కార్యక్రమాలు విస్రుతపరచడం , అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించడం అనే వ్యూహాలతో ముందుకు పోవడం. ఈ కాంపెయిన్‌లో ఆశా కార్యకర్తలు ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లల ను గుర్తించి వారి ఇంటికి వెళ్లి ఓ. ఆర్. ఎస్ మరియు జింక్ ను అందచేయడం జరుగుతుంది. అవి ఎప్పుడు వాడాలి, ఎలా వాడాలని అవగాహన కల్పించడం జరుగుతుంది. చేతుల శుభ్రత పై అవగాహన కల్పిస్తూ మరుగుదొడ్ల వాడకం వల్ల లాభలు తెలియచేస్తారు. ఓ. ఆర్. ఎస్. ద్రావణం తయారు చేసి చూపించడం జరుగుతుంది.


ఐదు సంవత్సరాల లోపు పిల్లలు ఉన్న ఇంటికి రెండు ఓ. ఆర్. ఎస్ పాకెట్స్, 14జింక్ మాత్రలు, కరపత్రం ఇవ్వడం జరుగుతుంది. ప్రతీ రోజూ నివేదిక వారి ఏ. ఎన్. ఎమ్ లేదా సి. హెచ్. ఓ కు ఇవ్వడం జరుగుతుంది అన్నారు. కావున స్టాప్ డైయరియా కార్యక్రమం లో అన్ని శాఖల సిబ్బంది ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, పంచాయతీ రాజ్ పాల్గొని , ప్రజలు అవగాహన కార్యక్రమాలలో విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని అతిసారా వల్ల చనిపోయే ఐదు సంవత్సరాల లోపు పిల్లల మరణాలను సున్నా కుతెచ్చేవిదంగా అంకితం అవుదామని డాక్టర్ ఉషశ్రీ పిలుపునిచ్చారు. అతిసారా తో జరిగే పిల్లల మరణాలను నివారిద్దాం- స్టాప్ డైయేరియాను విజయవంతం చేద్దాం.

## ప్రైవేట్ విద్యాసంస్థలకు..

# కొమ్ముకాస్తున్న విద్యాశాఖ అధికారులు

### - ప్రభుత్వానిబంధన తుంగలో తొక్కుతున్న విద్యాశాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి


### - ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ



**రాయదుర్గం టౌన్ - సూర్య వాస్తవం, జూన్ 15 :** ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న విద్యాశాఖ అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు, ప్రభుత్వ విద్య నియమ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లిన చూసి చూడనట్లు వ్యవహరిస్తూ విద్యాశాఖ అధికారులు మాత్రం వారి స్వలాభం కోసం ప్రభుత్వ విద్య నియమ నిబంధనలను పట్టించుకోకపోవడం దారుణమని, ఇలాంటి వ్యక్తులను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో విద్యాశాఖ అధికారి సమక్షంలోనే అనేక ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఎస్ఎఫ్ఐ విద్యాసంఘాలు అనేకసార్లు ధర్నాలు పోరాటాలు చేస్తున్న విద్యాశాఖ అధికారి స్పందించకపోవడం ధారుణ మన్నారు. పట్టణంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలు చేస్తున్నటువంటి మోసాలపై అనేక పత్రికలో కథనాలు సైతం వచ్చినప్పటికీ జిల్లా అధికారులు మాత్రం పట్టి పట్టనట్లుగా విచారించారని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఇచ్చే మామూల మత్తులో విద్యాశాఖ అధికారులు మునిగి, నిరుపేద కుటుంబాల విద్యార్థులతో జీవితాలు చెలగాటం ఆడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నామన్నారు.


జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు చేస్తున్న దోపిడీపై ఎన్నోసార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం చర్యలు చేపట్టలేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పీలుస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేషన్ విద్యాసంస్థల యాజమాన్యాల పట్ల వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో విచ్చలవిడిగా ఫీజులు, పుస్తకాల రూపంలో చేస్తున్నటువంటి దోపిడిని వెంటనే విద్యాశాఖ వ్యవస్థ స్పందించాలన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల చేస్తున్నటువంటి దోపిడిని అరికట్టడానికి విద్యాశాఖ అధికారిని నియమించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తున్నామన్నారు.

## ఫ్రీజర్ బాక్సు ఏర్పాటు చేసిన హిందూ రుద్రభూమి కమిటీ సభ్యులు



**రాయదుర్గం టౌన్ - సూర్య వాస్తవం, జూన్ 15 :** రాయదుర్గం పట్టణంలోని శాంతినగర్ లో గల హిందూ రుద్రభూమి ఆవరణలో ప్రజల సౌకర్యార్థం శవం కమిట్ ఉంచుటకు రెండు ఫ్రీజర్ బాక్సు ఏర్పాటు చేసినట్లు హిందూ రుద్రభూమి అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు టంకశాల హనుమంతు, అధ్యక్షులు చుంచుల నాగప్ప తెలిపారు. అలాగే శవాన్ని మోసుకెళ్లేందుకు రెండు స్టాండ్లు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శవాన్ని తీసుకు వెళ్ళేందుకు త్వరలో కొత్త "వైకుంఠ రథం" వాహనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాయదుర్గం పట్టణ ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ కోశాధికారి సూరే సుందర్ రావు, సభ్యులు పూజారి శ్రీనివాసులు, కాంబ్లీ పురందర, గుడేకోట శివకుమార్, బజారు బాబు, మాంత శ్రీనివాసులు, పోరాలు శ్రీనివాసులు, డీలక్స్ రాజు, మున్సిపల్ వార్డు సభ్యులు పోరాలు గోవిందరాజులు, ఆటో డ్రైవర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఫ్రీజర్ బాక్స్ అవసరమైన వారు అధ్యక్షులు నాగప్ప సెల్ నెంబర్ 8639572960, గౌరవ అధ్యక్షులు హనుమంతు సెల్ నంబర్ 9440822875, ఆటో డ్రైవర్ సురేష్ 9550067909 లను సంప్రదించాలని కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ..



**రాయదుర్గం టౌన్ - సూర్య వాస్తవం, జూన్ 15 :** రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని మలుపునుగుడి గ్రామానికి చెందిన బెస్త సిద్ధప్ప అనారోగ్యంతో హైదరాబాదులో కంటి ఆపరేషన్ చేసుకోగా ఎమ్మెల్యే హాలో శ్రీనివాసులు వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు ఏ సమస్యలో ఉన్న నా దృష్టికి తీసుకురావాలని, అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటాదని ఆయన అన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును తీసుకున్న బెస్త దాసప్ప తండ్రి సిద్ధప్ప రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగలి రాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, కందులూరు మోహన్ రెడ్డి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ విసిరిన సవాల్‌ను

# స్వీకరించలేక పారిపోయారు

**- మీరా.. తల్లికి వందనం, మంత్రి లోకేష్‌కు గురించి మాట్లాడేది**

**- వైసీపీ విమర్శలపై ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం**

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 15:** కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంటే.. దాన్ని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లికి వందనం విషయంలో మంత్రి నారా లోకేష్ పై చేస్తున్న విమర్శలను మీద ఆయన తీవ్రంగా స్పందించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి గత ప్రభుత్వం ఏ నిబంధనలైతే అమలు చేసిందో, అవే నిబంధనలను తాము కూడా పాటిస్తున్నామన్నారు. 'తల్లికి వందనం' పథకం కింద 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.8,745 కోట్లను జమ చేసిందన్నారు. మీ



ప్రభుత్వ హయాంలో ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా.. అందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పి.. మోసం చేసిన సంగతి ప్రజలు మర్చిపోలేదన్నారు. అప్పట్లో చాలా మందికి కోతలు విధించి.. ఏదో అందరికీ ఇస్తున్నట్టు గొప్పలు చెప్పుకున్నారన్నారు. ఈ పథకంపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు మీకు లేదన్నారు. గతంలో పాఠశాల నిర్వహణ, అభివృద్ధి కోసం ప్రతి విద్యార్థి నుంచి 2వేలు రూపాయలు తీసుకున్నారని.. అసలు ఆ డబ్బు ఏమైందో కూడా సమాధానం చెప్పాలన్నారు.

తాము ముందే చెప్పినట్టుగా ఆ 2వేలు దేనికి ఖర్చు చేస్తున్నామనేది మంత్రి లోకేష్ చాలా స్పష్టంగా చెప్పారన్నారు. అయితే దాన్ని ఆయన్ని ఖాతాలోకి వేసుకుంటున్నారని ఏ విధంగా ఆరోపణలు చేస్తారన్నారు. అసలు దీనికి మీ వద్ద ఏమైనా ఆధారాలు ఉన్నాయా అని నిలదీశారు. 24గంటల్లో దీనికి సమాధానం చెప్పమంటే వైసీపీ నాయకులంతా పారిపోయారన్నారు. కచ్చితంగా దీనిపై న్యాయపరంగా ముందుకెళ్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా మీ తప్పు ఒప్పుకుని క్షమాపణ చెప్పాలని వైసీపీ నాయకులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

## లంకమల అభయారణ్యంలో కూంబింగ్



**సిద్ధవటం - సూర్య వాస్తవం, జూన్ 15:** లంకమల అభయారణ్యంలోని సమ స్యాత్మక ప్రదేశాలలో ఆదివారం కూంబింగ్ నిర్వహించినట్లు సిద్ధవటం రేంజర్ బి కళావతి తెలిపారు. స్థానిక సిద్ధవటం అటవీ శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు సిద్ధవటం రేంజ్ పరిధిలోని రోళ్ళబోడు, గొల్లపల్లి, సిద్ధవటం బీట్లలోని సమస్యాత్మక ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. అటవీ ప్రాంతంలోని సమీప గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అటవీ సంపద కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత, విలువైన ఎర్రచందనం ఇతర దేశాలకు తరలకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అటవీ ప్రాంతాలు ఆనుకొని ఉన్న పంట పొలాల్లోకి వన్యప్రాణులు సంచరిస్తే ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఫారెస్ట్ బీటు, సహాయ బీటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరాడంబరంగా వైసీపీ

# రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్మదిన వేడుకలు

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూన్ 15:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి జన్మదినాన్ని ఆదివారం నియోజకవర్గం వ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరాడంబరం గానిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించగా, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగేవైఎస్ఆర్ సిపి శ్రేణులు శ్రీకాంత్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని పలు ప్రాంతాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. నియోజక వర్గ అభివృద్ధికి శ్రీకాంత్ రెడ్డి చేసిన సేవలను కొనియాడుతూ వైఎస్ఆర్ సిపినాయకులు, కార్యకర్తలు, ప్రజలు శ్రీకాంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్ఆర్ సిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో పట్టణంలో వెయ్యి మందికి పైగా పేదలకు అన్నదానం నిర్వహించారు.

నా జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునాధన్యవాదాలు...

వైఎస్ ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

నా జన్మదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన



ప్రతి ఒక్కరికీ, సేవా కార్యక్రమాలు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో నేడు స్థానికంగా అందుబాటులో లేనందుకు తనను మన్నించమని ఆయన కోరారు. నా శ్రేయస్సును కోరి ఆలయాలలో పూజలు చేయడం, నాకు ఆశీస్సులు అందచేసిన ప్రతి ఒక్కరికీ సదా రుణపడిఉంటానన్నారు. జన్మదినాన్ని ఆడంబరంగా కాకుండా సేవా కార్యక్రమాలకే అంకితం చేయాలన్న నా సంకల్పానికి అనుగుణంగా, మీరు చేపట్టిన ప్రతి సామాజిక కార్యక్రమం నా మనస్సును చాలా హత్తుకుందన్నారు. ప్రజలు చూపిస్తున్న ఆదరాభి మానాలు, నమ్మకం నాలో బాధ్యతను, నిబద్ధతను మరింత పెంచాయన్నారు. జీవితాంతం ప్రజల సంక్షేమం కోసం పాటుపడతానన్నారు. నా పుట్టినరోజు సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన వైఎస్ఆర్ సిపి కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు, ప్రజలకు అందరికీ మరోసారి ధన్యవాదాలు తెలుపు చున్నానని, అలాగే సోషియల్ మీడియా, మెసేజ్ లు,ఫోన్ కాల్స్ వివిధ రూపాల ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.







## మాగంటి గోపినాథ్ మరణం

## చాలా బాధాకరం : ఎమ్మెల్యే సునీత





**రాప్తాడు- సూర్య వాస్తవం, జూన్ 15:** సినీ నిర్మాత,హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ శాసన సభసభ్యుడు మాగంటి గోపినాథ్ మృతి చాలా బాధాకరమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గత వారంలో అనారోగ్యానికి గురై మరణించిన నేపథ్యంలో హైదరాబాద్ లోని ఆయన నివాసానికి ఎమ్మెల్యే సునీత వెళ్లారు అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తొలిసారి తెలుగుదేశం పార్టీ నుంచే ఆయన ఎమ్మెల్యేగా గెలిచారని ఈ సంధర్భంగా సునీత అన్నారు. సినీ నిర్మాతగా ఆయన పేరు గడించారని స్వతహాగా ఎంతో మంచి వ్యక్తిగా, అందరితో సన్నిహితంగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు.ప్రత్యేకించి మా కుటుంబంతో మాగంటికి ఎంతో అనుబంధం ఉందన్నారు. తమ కుటుంబంలో జరిగిన శుభాకార్యాలకు హాజరయ్యారని అన్నారు. ఎప్పుడు కనిపించినా ఎంతో ఆప్యాయంగా పలుకరించే వారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే సునీత ఆకాంక్షించారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు ఉధృతం చేద్దాం

**- సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య**

**పత్తికొండ టౌన్ -సూర్య వాస్తవం, జూన్ 15 :**

కేంద్ర, రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు ఉధృతం చేద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని దూదేకొండ సిపిఐ శాఖ మహాసభ శాఖ కార్యదర్శి రాముడు అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు తాము అధికారంలోకి వస్తే పెంచిన ధరలను తగ్గిస్తామని, ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చి, ఐదు గ్రామాలకు రెండు పర్యాయాలు పూర్తయినా కూడా ఏ ఒక్క హామీని నెరవేర్చింది లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో 90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఎరువులను పంపిణీ చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలలో తక్షణమే 20వేల రూపాయలు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుమంచి, జిల్లా సమితి సభ్యులు కారన్న, పెద్ద ఈరన్న, కృష్ణయ్య, ప్రజా సంఘాల నాయకులు రంగన్న, నెట్టికంటయ్య, ఆంజనేయ, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ధ్వజావరోహణంతో ముగిసిన


# శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**తిరుపతి - సూర్య వాస్తవం, జూన్ 14 :**

అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి ధ్వజావ రోహణంతో ముగిశాయి. రాత్రి 7.00 - 07.30 గంటలకు ధ్వజావరోహణ ఘట్టం నిర్వహించారు. గరుడ పటాన్ని అవనతం చేసి ధ్వజారోహణం నాడు ఆహ్వానించిన సకల దేవతలను సాగనంపారు. దీంతో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకునే వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమృద్ధితో తులతూగుతారని ఐతిహ్యం. **వైభవంగా చక్రస్నానం:** అంతకు ముందు ఉదయం 08.00- 9.00 గం.ల మధ్య పల్లకీ ఉత్సవం చేపట్టారు. తదుపరి 9.15 - 10.30 గం.ల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉదయం 10.30 - 10.45 గం.ల వరకు తీర్థవారి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం 4.00- 5.00 గం.ల మధ్య శ్రీవారి మాడవీధి ఉత్సవం జరిగింది. వాహన సేవలో టిటిడి డిప్యూటీ ఈవో హరీంధ్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు,భక్తులు పాల్గొన్నారు.












# నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**- అర్జీలను meekosam.ap.gov.in వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చు**

**- అర్జీలపై సమాచారం కొరకు మీకోసం కాల్ సెంటర్ నెంబర్ 1100 ను సంప్రదించగలరు**

**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**రాయచోటి-సూర్య వాస్తవం,జూన్ 15:** ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు,నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్కు సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

## పలుచోట్ల కొత్త మోటార్లు ఏర్పాటుకు మున్సిపల్ ఛైర్మన్ కసరత్తు



**హిందూపురం -సూర్య వాస్తవం, జూన్ 15:** పట్టణంలోని పలుచోట్ల కొత్తమోటార్లను ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ ఛైర్మన్ రమేష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలువార్డుల్లో బోర బావులకు కొత్త మోటార్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు నిధుల ద్వారా మోటార్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పట్టణంలో నీటి సమస్య తలెత కుండా ప్రయత్నిస్తామన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్తో పాటు, బోరుబావులు కూడా అంద బాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

## రాత్రివేళ పోలీసుల నిఘా

**- నేరాలు నియంత్రించేందుకు తనిఖీలు**

**- డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం**








**అనంతపురం క్రైం -సూర్య వాస్తవం, జూన్ 15:** నేరాల నియంత్రణ, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అనంతపురం జిల్లా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు.జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు... రాత్రి వేళ పోలీసులు జిల్లా వ్యాప్తంగా పటిష్ఠ గస్తీ విధులు నిర్వహించారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పరిధిల్లోని భద్రత కోసం నైట్ రౌండ్స్ అధికారులు నిరంతరం బీట్ పాయింట్లను తనిఖీ చేస్తూ దేవాలయాలు,ప్రార్థన మందిరాలు, ఏటీఎం కేంద్రాలు, బ్యాంకులు మరియు ఇతర ముఖ్య వ్యాపార సముదాయాల వద్ద సిబ్బందిని అప్రమత్తంగా విధుల్లో నిమగ్నం చేశారు. నేరాల నియంత్రణ మరియు అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రత్యేక శ్రద్ధ చూపుతూ భద్రతా చర్యలు చేపట్టారు. అదేవిధంగా... అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను తనిఖీలు చేపట్టడం... ఓపెన్ డ్రింకింగ్ ల కట్టడిపై దృష్టి సారించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. వాహన రికార్డుల పరిశీలన, ప్రయాణీకుల వివరాల సేకరణ మరియు అనుమానిత వ్యక్తుల వేలిముద్రలు తీసుకునే కార్యక్రమాల ద్వారా దొంగతనాలు, అక్రమ రవాణా, మరియు ఇతర నేరాలను నియంత్రించడానికి కఠిన చర్యలు తీసుకున్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**హిందూపురం -సూర్య వాస్తవం, జూన్ 15:**

యోగా చేయడంవల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యవ వుతుందని యోగా శిక్షకులు అన్నారు. పట్టణంలోని వివిధ యోగా శిక్షకులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ యోగా చేయడంవల్ల ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం ఉంటుం దన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత ఉండాలంటే యోగాను అలవాటుచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రమేష్ యోగా శిక్షకులు, పట్టణ ప్రజలు హాజరయ్యారు.




## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి - సూర్య వాస్తవం జూన్ 15:** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 16వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య తెలియజేశారు.అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు

## ఫుట్‌బాల్ జూనియర్ జట్లు ఎంపిక

**- ఎంపికైన జట్లతో అసోసియేషన్ నాయకులు**



**హిందూపురం- సూర్య వాస్తవం, జూన్ 15 :** పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్టు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు జేవీ అనీల్ కుమార్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాలురు, బాలికల ద్వితీయ క్రీడా జట్లు ఎంపిక చేయడం జరిగిందన్నారు. వీరు త్వరలో జరిగే అంతర్జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఫుట్బాల్ అసోసియేషన్ ట్రెజరర్ శేఖర్. కార్యదర్శి మహ్మద్ సలీం, విజయవాణి, లోకనాథ్, ఆజాద్, బాస్కర్, చైతన్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సిమెంట్ లారీ బోల్తా ..

**- డ్రైవర్‌కు గాయాలు**



**పెళ్లకూరు, తిరుపతి- సూర్యా వాస్తవం ,జూన్ 15 :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాలెం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఓ సిమెంట్ లారీ బోల్తా పడిన ఘటన కలకలం రేపింది.నెల్లూరు వైపు నుంచి అరక్కోణం దిశగా వెళ్తున్న లారీ, చిల్లకూరు వడ్డిపాలెం వద్దకు చేరుకునేసరికి , డ్రైవర్ సెంథిల్ నిద్రమత్తులోకి జారడంతో లారీ అదుపుతప్పి బోల్తా పడినట్లు స్థానికులు వెల్లడించారు.ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు, క్షతగాత్రుడిని 108 వాహనము ద్వారా నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాద సమయంలో లారీలో ఉన్న సిమెంట్ సంచులు రహదారిపై చిందర వందరగా పడిపోవడంతో, ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం ఏర్పడింది.

## నేడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**- జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్**



**తిరుపతి- సూర్య వాస్తవం, జూన్ 15:** ప్రతి సోమవారం జిల్లా కేంద్రం తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు మరియు రెవిన్యూ డివిజన్ , మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జూన్ నెల 16వ తేదీ (నేడు) సోమవారం రోజున ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటవరకు ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ గారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంట వరకు జిల్లా కలెక్టరేట్ తో పాటుగా డివిజన్, మండల కేంద్రాలలో నిర్వహించే ప్రజా సమస్యల పరిస్కార వేదిక లో ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు అందరు కలెక్టరేట్ నందు నిర్వహించే పీజీ ఆర్ ఎస్ కార్యక్రమానికి, అలాగే డివిజన్, మండల కేంద్రాల్లో పీజీఆర్ఎస్‌కు సంబంధిత అన్ని శాఖల అధికారులు ప్రతి సోమవారం తప్పక హాజరు కావాలని తెలిపారు.అర్జీదారులు వారి యొక్కఅర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో కూడా వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే వారి యొక్క అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## మంత్రి నారాయణకి జన్మదిన శుభాకాంక్షలు

**- తిరుపతి పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు పరసా రాజా**



**నాయుడుపేట-సూర్య వాస్తవం, జూన్ 15:** రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కు నాయుడుపేట మండలం గొట్టిప్రోలు గ్రామానికి చెందిన తిరుపతి పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు పరసా రాజా మంత్రి నారాయణ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం నెల్లూరు నగరంలోని మంత్రి నారాయణ నివాసంలో జరిగిన ఆయన జన్మదిన వేడుకల్లో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరసా రాజ మంత్రి నారాయణ కు శాలువాలు కప్పి,పూల మాలలు వేసి ఘనంగా శాలువాలు కప్పి, సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఆగిన వర్షం నీరు.. వెళ్లేందుకు దారి ఎటు

**సిద్దవటం -సూర్య వాస్తవం, జూన్ 15:**

ఇటీవల కురుస్తున్న వర్షం వల్ల మండలకేంద్రమైన సిద్దవటం బేల్దారి వీధిలో వెళ్లేందుకు దారి లేకపోవడంతో సీసీ రోడ్డుపైనే వర్షపు నీరు ఆగిపోయింది. బేల్దారి వీధిలో ఒక సీసీ రోడ్డు కింద ఉండగా కుమ్మరి వీధికి వెళ్లే సీసీ రోడ్డు ఎత్తులో ఉంది. వర్షం పడినప్పుడు వర్షపు నీరు కింద ఉన్న సీసీ రోడ్డుపై నీరు నిలిచిపోతుంది. రోడ్డు ప్రక్కన నుంచి నీరు వెళ్లేందుకు మట్టి పేరుకు పోవడంతో వర్షపు నీరు ఆగి ఉన్నాయి. రోడ్డు ప్రక్కన నుంచి కాలువ తీస్తే సీసీ రోడ్డుపై నిలిచి ఉన్న నీరు వెళ్తుందని స్థానికులు తెలుపుతున్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )